ప్రజాశక్తి

శనివారం 26 జులై 2025 | 5 | శ్రీ సత్యసాయి



జీఎస్టీ వసూళ్లకు తగిన చర్యలు

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జీఎస్టీ వసూళ్లకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వాణిజ్య పన్నుల శాఖతోపాటు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోకలెక్టర్ తో పాటు ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ హేమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పన్ను దారుల నుండి జీఎస్టీ సక్రమంగా వసూలు చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పరిశ్రమల శాఖ నుండి పన్నుల పరిధిలోకి రాకుండా ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని ఒకవేళ పన్నుల పరిధిలోకి వచ్చినట్లు అయితే వసూలు చేయాలని అన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ షేరింగ్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. అన్ని ప్రొఫెషనల్ సర్వీసులు సంస్థలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ మెడికల్ సంస్థలకు జీఎస్టీ తప్పనిసరిగా నమోదు కావాల్సిందిగా ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలన్నారు. పన్నుల వసూలు పెంపునకు సంబంధిత శాఖలు, బ్యాంకులు, స్థానిక సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీస్ శాఖ మైనింగ్ లైసెన్సులు మంజూరు చేసే ముందు జిఎస్టి రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకొని బకాయిలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే అనుమతులు మంజూరు చేయాలన్నారు. వాహన యజమానుల నుండి పన్నులు వసూళ్లలో రవాణా శాఖ అధికారులు తమ సంపూర్ణ సహకారాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ వలి, అనంతపురం, హిందూపురం, ధర్మవరం వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సుధాకర్ రెడ్డి, చందు, ఎల్‌డిఎం రమణ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల మార్గదర్శకులను వేగవంతంగా గుర్తించండి : బంగారు కుటుంబాలు మార్గదర్శకులను గుర్తించడంలో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో పి.4 బంగారు కుటుంబాలు భద్రత, మార్గదర్శకుల ఎంపిక, గ్రామసభలు, ప్రభుత్వ పథకాల సేవలు, ప్రజాస్పందనలు వంటి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శకుల ఎంపిక, నమోదు వేగవంతంగా పూర్తి చేసి ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజాస్పందనలు స్వీకరించాలన్నారు. ఆగస్టు 1న పింఛన్ పంపిణీని ఎలాంటి జాప్యం లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సంబంధిత అధికారులు వారంలో ఒకసారి వసతి గృహాల తనిఖీలు నిర్వహించాలని అందులో ఉన్న సమస్యలను గుర్తించాలని వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఎంపీడీవోలు తల్లికి వందనం కొరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించాలని వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీవో విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శివ రంగ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్కడంతా రహస్యమే..!



కనీస సౌకర్యాలు లేని వలస కార్మికుల నివాసాలు

- వరుస ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు
- ప్రమాదం జరిగితే పక్క రాష్ట్రంలో వైద్యం
- వలస కార్మికులకు రక్షణ కరువు
- కనీస సౌకర్యాలకు నోచని కార్మికులు
- బాధితులకు అందని పరిహారం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడ ఒక రహస్య మాయాలోకం. అక్కడంతా రహస్యమే..! ఉన్నచోట ఉపాధి లేక పొట్టకూటి కోసం వచ్చిన వలస కార్మికులు వరసగా ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ అటు పరిశ్రమల శాఖలో కానీ, ఇటు కార్మిక శాఖలో గాని కనీస స్పందన కనిపించడం లేదు. ఈ పారిశ్రామిక వాడలో ఉన్న స్టీల్, రసాయన పరిశ్రమల్లో నిత్యం ఏదో ఒక పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారిని స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు ఇక్కడ వైద్యం అందిస్తే ప్రమాదాలు జరిగిన విషయం బయటకు వస్తుందని పక్కనే ఉన్న కర్నాటక రాష్ట్రానికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

వారం క్రితం గోళాపురం పారిశ్రామిక వాడలోని బ్లూ గోల్డ్ స్టీల్స్ పరిశ్రమలో సమయంలో రోలింగ్ మిల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వలస కార్మికుడు అనూప్ ప్రమాదానికి గురికావటంతో కుడి కాలు విరిగిపోయింది. ఈ విషయంపై పరిశ్రమ మేనేజర్ ను సంప్రదిస్తే తనకు ఏమీ తెలియదని చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రమాదానికి గురైన కార్మికుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గుండా జిల్లాకు చెందిన కార్మికుడిగా తెలిసింది. కార్మిక శాఖ నిబంధనల మేరకు ప్రమాదం జరిగిన వెంటనే హిందూపురం పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసుకుని వెళ్లాల్సి ఉంది. అయితే ఇలాంటి నిబంధనలను స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు ఏమాత్రం పాటించడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే పక్క రాష్ట్రమైన కర్నాటకకు తీసుకుపోవడం అక్కడ వైద్య సేవలు అందించడం నిత్యకృత్యమైంది. ఒకవేళ ఆ కార్మికుడు మృతి చెందితే కాస్తో కూస్తో ఆ కుటుంబానికి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇదే విధంగా 20 రోజుల క్రితం మీనాక్షి స్టీల్ పరిశ్రమ నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంతో రోలింగ్ మిల్ విభాగంలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం జమాయి జిల్లా కర్మ గ్రామానికి చెందిన వలస కార్మికుడు జూబ్లాల్ టిఎంటికి ఇనుప రాడ్డు కడుపులోకి చొచ్చుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. వీరి కుటుంబానికి కాస్త కూస్తో నష్ట పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి వెలుగులోకి తీసుకురావడంతో ఆ కార్మిక కుటుంబానికి తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు స్పందించి న్యాయపరంగా నష్టపరిహారం అందించే విధంగా పరిశ్రమ యాజమాన్యంతో ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయాలన్నీ ఆయా పరిశ్రమల నిర్వాహకులు బయటకు పక్కకు రాకుండా గోప్యంగా ఉంచుతున్నారు. అందుకోసమే స్టీల్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని తీసుకుంటున్నారు. వలస కార్మికులను నేరుగా పరిశ్రమ నిర్వాహకులు తీసుకోకుండా కాంట్రాక్టర్ ద్వారా ఉద్యోగంలో నియమించుకుని వలస కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని హిందూపురం రూరల్ మండలంలో ఉన్న తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ గుర్తింపును ఇక్కడ ఉన్న స్టీల్ రసాయన పరిశ్రమల నిర్వాహకుల వల్ల కనుమరుగు అవుతోంది. ఇక్కడ దాదాపు 150 కి పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో స్టీల్, రసాయన పరిశ్రమల్లో ఎక్కువ శాతం కార్మికులు ఒరిస్సా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది వలస కార్మికులు పొట్టకూటి కోసం వారి ప్రాణాలను ఫణంగా పెట్టి బానిసలకన్నా హీనంగా కార్మికులు పనిచేస్తున్నారు. చట్టం ప్రకారం వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి కార్మికుల వివరాలన్నింటిని కార్మిక శాఖకు ఇవ్వడంతో పాటు కార్మికులందరికీ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆయా పరిశ్రమలపై ఉంది. చట్టాన్ని చుట్టంగా మార్చుకున్న స్టీల్ పరిశ్రమల నిర్వాహకులు పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ అధికారులకు ముడుపులు ఇచ్చుకుంటూ వారి పరిశ్రమల నుంచి మూడు పువ్వులు ఆరు కాయలుగా లాభాలను ఆర్జిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఉన్న ఈ రెండు శాఖలు ఎప్పుడైనా వారికి ముడుపులు అవసరమైనప్పుడు పరిశ్రమలను తనిఖీ పేరుతో వచ్చి ముడుపులు తీసుకుని వెళ్ళిపోతున్నారే తప్ప ఏ ఒక్క పరిశ్రమ పైన ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రమాదాలు సంభవించి ఎంతోమంది అవిటి వాళ్లు కావడంతో పాటు ఎన్నో కుటుంబాలు ఉన్న పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నప్పటికీ అధికారుల్లో చలనం మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా ముడుపుల మత్తులో తులతూగుతున్న పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ అధికారులు స్పందించి వలస కార్మిక చట్టాన్ని పక్కాగా అమలు చేయడంతో పాటు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీంతోపాటు వివిధ ప్రమాదాల్లో గాయపడిన కార్మికుల కుటుంబాలకు కార్మిక చట్టాన్ని అనుసరించి నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకొని ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రమాదంలో కాలుపోగొట్టుకుని హిందూపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వలస కార్మికుడు అనూఫ్



ఇటీవల ప్రమాదం జరిగిన పరిశ్రమ

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు



తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న స్టీల్ పరిశ్రమల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు సంభవించిన సమయంలో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సకాలంలో పరిశ్రమలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వలస కార్మిక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.

రవికుమార్,
తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేవి అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎం.హెచ్. జబీవుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, శారీరక దఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. చిన్ననాటి నుండి తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడలలో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫాజిల్, జబీ, హనీఫ్, సాదిక్, అన్సర్, తలహా, సమాజ సేవకుడు ఉమర్ ఫరూక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమ కుంట పంచాయితీలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్యకార్యక్రమాన్ని నిర్వహించారు.ఎ పంచాయతీ పరిధిలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ రత్నమ్మ మాట్లాడుతూ, ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాన్ని వేయకుండా పంచాయతీ ఎంపిక చేసిన ప్రాంతంలో మాత్రమే చెత్త వేయాలన్నారు. అదేవిధంగా ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, హరిత రాయబారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే 'కూటమి' లక్ష్యం

నందమూరి వసుంధర దేవి

ప్రజాశక్తి-హిందూపురం

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నాయకులు కార్యకర్తలతో కలిసి హిందూపురం రూరల్ మండలం వీవర్స్ కాలనీలో, సాయంత్రం హిందూపురం పట్టణంలోని 8, 9 వ వార్డు పరిధిలో ఉన్న శ్రీకంఠాపురం, లక్ష్మీపురం తదితర ప్రాంతాలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు హాజరైన వసుంధర దేవికి స్థానిక నాయకులు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. వసుంధర దేవి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమం అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని స్థానిక నాయకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, రూరల్ అధ్యక్షులు రాము, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, వార్డ్ కౌన్సిలర్ మంజుళ, నాయకులు దుర్గా నవీన్, చంద్రమోహన్ యాదవ్, అంజి, శ్రీదేవితో పాటు అధికసంఖ్యలో నాయకులు కార్యకర్తలతో పాటు బాలకష్ణ అభిమానులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం : నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పాల్గొన్నారు. హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలో రూ. 3 కోట్లతో నిర్మాణం చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. లేపాక్షి మండల కేంద్రంలో ఉన్న నవోదయ పాఠశాలలో హెరిటేజ్ కంపెనీ సి ఎస్ ఆర్ నిధుల నుంచి రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ గీజర్స్‌ను ప్రారంభించారు. చిలమత్తూరు మండలం దేనికేతపల్లి నుండి తమ్మి నాయన పల్లి వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 1 కోటితో నిర్మాణం చేస్తున్న సిసి రహదారి నిర్మాణ పనులను భూమి పూజ చేశారు. లేపాక్షి మండలం బిసలమానేపల్లి నుండి ఓబుళాపురం వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ 3 కోట్లతో నిర్మాణం చేసిన బీటి రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, బాలకష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, పార్టీ రూరల్ అధ్యక్షులు రాము, మాజీ జెడ్పిటిసి ఆదినారాయణ, రామగిరి సూరి, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.




ప్రభుత్వ అభివృద్ధి పథకాలు వివరించే కరపత్రాన్ని వృద్ధుడికి అందజేస్తున్న నాయకులు

త్రిశంకు స్వర్గంలో కదిరి వైసిపి

నడిపించే నాయకుడు కరువు
వైసిపి సమన్వయకర్త ఒంటెద్దు పోకడలతో విసుగు
పలువురు నాయకుల తిరుగుబావుటా

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలో వైసిపి పరిస్థితి త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తోంది. నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యాడు. పార్టీ నియోజకవర్గ వర్గ సమన్వయకర్త ఒంటెద్దు పోకడలతో పలువురు నాయకులు, కార్యకర్తలు విసుగు చెందారు. బహిరంగ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తల్లో సమన్వయం లోపించింది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని విపరీతంగా అవినీతి అక్రమాలకు పాల్పడిన నాయకులు అడ్డదిడ్డంగా సంపాదించి కష్టకాలంలో ముఖం చాటేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వారు చేసిన అక్రమాలపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం వారి అవినీతిని ఎండగడుతోంది. స్థానిక నాయకుల అక్రమాలపై ఎమ్మెల్యే దృష్టి సారించారు.



వైసిపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో కదిరి నియోజకవర్గంలోని ఆపార్టీ నాయకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు విచ్చలవిడిగా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడి జేబులు నింపుకున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేసేశారు. అంతటితో ఆగని వైసిపి నాయకులు ఆ స్థలంలో అక్రమంగా పెద్ద పెద్ద భవనాలు నిర్మించారు. మట్టి మాఫియాదార్లు కొండలను పిండి చేశారు. చెరువులను సైతం కబ్జా చేసి పంటలు సాగు చేశారు. క్రిస్టియన్ ఆస్తులలో తలదూర్చి దొంగ సంతకాలు చేసేశారు. ఎన్నికల ముందు అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఆ పార్టీ ప్రస్తుత సమన్వయ కర్త వలస పక్షిగా వచ్చిన మక్బూల్ అహ్మద్‌కు వైసీపీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించింది. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది కదిరిలో ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ గెలుపొందారు. ఎన్నికల ముందు వరకు పెట్రేగిపోయిన వైసీపీ నేతలు అధికారం కోల్పోయిన తర్వాత పత్తా లేకుండా పోయారు. గత ఎన్నికలో వైసీపీ పార్టీ అభ్యర్థిగా నిలబడి ఓడిపోయిన మగ్బూల్ అహ్మద్ సైతం కదిరికి అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వస్తూ వెళుతుంటారు. బెంగళూరులో ఉన్న మక్బూల్ అహ్మద్ కదిరిలో కార్యకర్తలు నాయకులు అందుబాటులో లేకపోవడంతో వారికి తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆ పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యారు. అధికార మదంతో అవినీతి అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు పత్తా లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతల అక్రమాలపై విచారణ చేపట్టాలని అధికారులకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూలగొట్టారు. ప్రభుత్వ ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమించుకున్న చెరువులు సైతం స్వాధీనం చేసుకున్నారు. క్రిస్టియన్ ఆస్తులలో దొంగ సంతకాలు చేసిన మక్బూల్ అహ్మద్ పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వారితో పాటు వైసీపీ నాయకులు కేసులను ఎదుర్కోలేక ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఎన్నికల అనంతరం కదిరిలో వైసీపీ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తిరిగి ఓపెన్ చేశారు. నియోజవర్గ సమన్వయకర్త అందుబాటులో లేకపోవడంతో ఆ పార్టీ దిగువ స్థాయి శ్రేణులు ఏం చేయాలో దిక్కుతోచక అయోమయంలో పడిపోయారు. ఆ పార్టీ ఇచ్చిన పిలుపును ప్రజలలోకి తీసుకెళ్లటంలో వైసీపీ సమన్వయ కర్త వైఫల్యం చెందారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే వైసిపి కి చెందిన జడ్పిటిసి భర్త నల్లచెరువు మండలం నాయకులు విశ్వనాథరెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్‌పై తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. మక్బూల్ ఒంటెద్దు పోకడలతో పార్టీకి, కార్యకర్తలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని విమర్శించారు. ఆయన వ్యవహార శైలిని తప్పుపట్టారు.

కుమ్ములాటలో వైసిపి నేతలు

గత ఎన్నికల్లో ఓటమిపాలైన మక్బూల్ అహ్మద్ కు నియోజకవర్గ సమన్వయకర్తగా అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. అయితే సమన్వయ కర్తను ఎలాగోలాగా ఇబ్బందులు గురిచేయాలని ఉద్దేశంతో కొంతమంది కీలక వైసిపి నేతలు మక్బూల్ అహ్మద్ పై వైసీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. గాండ్లపెంట ఎంపీపీ ,కదిరి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పదవులను టిడిపి కైవసం చేసుకోవడంతో వైసిపి మరింత డీలాపడింది ఆ విషయం కూడా మక్బుల్ పై ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని పార్టీ కన్వీనర్ల ఎంపికలో కూడా మక్బూల్ అహ్మద్ వైసీపీ నేతల అభిప్రాయాలు తీసుకోకుండా వన్‌మ్యాన్ షోగా వ్యవహరించడంతో ఆయనపై వైసిపి కీలక నేతలు గుర్రుగా ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ కదిరి నియోజకవర్గంలో వైసిపి నేతలు పూల శ్రీనివాసులు రెడ్డి, ఇస్మాయిల్, అత్తార్ చాంద్ బాషా, వజ్ర భాస్కర్ రెడ్డి తదితరులు అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడం లేదు. ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత మక్బూల్ అహ్మద్ అప్పుడప్పుడు కదిరికి వస్తున్నాడు. వైసీపీ శ్రేణులకు భరోసా ఇచ్చే నాయకుడు లేకపోవడంతో కదిరిలో వైసీపీ పరిస్థితి దారుణంగా తయారైంది. కదిరిలో వైసీపీ పరిస్థితి రోజు రోజుకు అగోమచర్యంగా మారుతుందోనడంలో ఎలాంటి సందేహం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

'మీ పిల్లలకైతే ఇలాంటి భోజనం పెడతారా'..?

ప్రజాశక్తి-బుక్కపట్నం

'మీ పిల్లలకైతే ఇలాంటి భోజనమే పెడతారా'..? అని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, హెచ్ఎంలను ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మండలంలోని పాముదుర్తి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా లేకపోవడంతో మీ ఇంట్లో పిల్లలకు కూడా ఇలాంటి భోజనమే పెడతారా అని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు గిరిప్రసాద్, హెచ్ఎం వెంకటనరసమ్మపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇకపై పిల్లలకు అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు, మజ్జిగతో కూడిన నాణ్య మైన ఆహారం అందించాలని ఆదేశించారు. మీకు చేతకాకపోతే చెప్పండి మరొకరికి అప్పగిస్తామన్నారు. హెచ్ఎం ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని హెచ్చరించారు. అనంతరం 7వ తరగతి పాఠశాల విద్యార్థులకు సోషియల్ పాఠ్యాంశాన్ని బోధించారు. బ్లాక్ బోర్డుపై నెమలి చిత్రాన్ని వేశారు. విద్యార్థుల చేత నెమలి చిత్రాన్ని వేయించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పాముదుర్తి జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఆగ్రహం



పాముదుర్తి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

సిఎం చంద్రబాబు పాలనాదక్షతతో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా వారు మండలంలోని మారాల పంచాయతీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది పాలలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీశారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్ మల్‌రెడ్డి, నాయకులు అప్పస్వామి, గంగాధర్, వెంకటరాముడు, నాగరాజు, లావణ్యగౌడ్, చంద్ర, ఓబులేసు, ఆంజనేయులు, కిష్టప్ప, హరి, రామానాయుడు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే బండ్లపల్లిలో పర్యటన

కొత్తచెరువు : మండలంలోని బండ్లపల్లి పంచాయతీలో శనివారం జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటారని పిఆర్‌ఒ సంతోష్‌రెడ్డి తెలిపారు. వారు ఉదయం సహకార సంఘం అధ్యక్షులుగా బెస్త శంకరప్ప, డైరెక్టర్లుగా శీనప్ప, దాసరి నారాయణ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా బండ్లపల్లి, కమ్మవారిపల్లి, నారాయణపురం గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నంబులపూలకుంట : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ బాలాజీ నాయక్ ఆదేశించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఎన్‌పికుంటలో పలు వీధుల్లో పర్యటించి మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పంచాయతీ అధికారుల సహకారం ఉంటేనే వ్యాధులను నిర్మూలించవచ్చన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సిహెచ్ఒ నాగలక్ష్మి, ఎఎన్ఎం శంకరమ్మ, హెల్త్ అసిస్టెంట్ విజయభాస్కర్, రమేష్‌రెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గౌనిపల్లి హైస్కూల్‌లో కంటి పరీక్షలు

ఓబుళదేవరచెరువు : మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్ లో పూర్వ విద్యార్థి మల్లెల రమేష్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పుట్టపర్తికి చెందిన పీస్ వెల్ఫేర్ సొసైటీ, డాక్టర్ బొగ్గు సురేష్ సహకారంతో ఈ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించగా 20 మందికి కళ్లద్దాలు వాడాలని సిఫారసు చేశారు. శిబిరంలో హెచ్ఎం విజయమ్మ, ఉపాధ్యాయ బృందం, ఎంఎల్‌హెచ్‌పి వసుంధర, ఆరోగ్య కార్యకర్త ఇందిరమ్మ, ఆశా కార్యకర్తలు ఉమ, సుశీలమ్మ, హాస్పిటల్ స్టాఫ్ షానవాజ్, సుధాకర్, మోహన్, స్రవంతి, జాస్మిన్ పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై అవగాహన

సోమందేపల్లి : మండలంలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం ఏవో విజయభారతి ఆధ్వర్యంలో రైతులకు రాగి పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రాగి పంట సాగు విస్తీర్ణం, మెలకువలు, వాటి ప్రాముఖ్యత, ప్రభుత్వం అందించే మద్దతు ధర, పంటకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలు, ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, వేరుశనగ, పంటల్లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. అనంతరం ఆమె రాగి పంట పొలాలను పరిశీలించారు. ఆమె వెంట ఎఇఒ అలేఖ్య, రంగప్ప, రమణప్ప, వెంకటప్ప, చలపతి, కోదండప్ప, నరసింహప్ప, శ్రీనివాసులు, చిరంజీవి, కిష్టప్ప, రైతులు ఉన్నారు.

'బంగారు' కుటుంబాలపై గ్రామసభ

అమడగూరు : మండలంలోని చినగాని పల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం పి-4 సర్వే బంగారు కుటుంబాలపై గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ రామనాథరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను గుర్తించి, వాటిని బంగారు కుటుంబాలుగా అభివృద్ధికి చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రణాళిక కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఆ కుటుంబాల వివరాలను గ్రామసభలో చదివి వినిపించి వారికి దిశా, దశ నిర్దేశించారు. అధికారులు ఆ కుటుంబాలకు అవగాహన కల్పించారు. గుర్తించిన ఆ కుటుంబాలు గ్రామాలకు మార్గదర్శకులుగా మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సరస్వతమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి బోనాలు

సోమందేపల్లి : సోమందేపల్లి పాతూరిలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరిదాస్ ఆధ్వర్యంలో అమ్మ వారికి 1200 బోనాలు సమర్పించారు. పెద్దమ్మ ఆలయం సర్కిల్ నుంచి ధనలక్ష్మి రోడ్డు మీదగా మహిళలు, యువతులు తలపై బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేర్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, ఎంపిటిసి పూజారి ఈశ్వరయ్య, జడ్పిటిసి డిసి అశోక్, టిడిపి టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, సిద్ధలింగప్ప, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ముత్యాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండలానికి చెందిన అంకే ముత్యాలప్పను ఎన్నుకున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు నగరంలో నిర్వహించిన రాష్ట్ర 8వ సభలో ముత్యాలప్పను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు


కొత్తచెరువు రూరల్ : మండలంలోని నారేపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రశాంత్‌కుమార్ కనిపించడం లేదని కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ మారుతిశంకర్ తెలిపారు. ప్రశాంత్ కుమార్ ఈ నెల 19వ తేదీ తాను మాచర్లలోని ఓ బీటెక్ కాలేజ్ చేరేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అయితే ఇంతవరకూ ఇంటికి తిరిగి రాలేదని అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏడు గొర్రెలు మృతి

పరిగి : మండలంలోని పుట్టగుర్లపల్లి గ్రామానికి చెందిన దాసయ్యగారి సూర్యనారాయణకు చెందిన 7 గొర్రెలు శుక్రవారం ఉన్నఫళంగా మృత్యువాత పడ్డాయి. మరో రెండు గొర్రెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. తెల్లవారుజామున గొర్రెల యజమాని పశువుల పాకలో చనిపోయిన గొర్రెలను చూసి లబోదిబోమన్నాడు. అయితే ఈ గొర్రెలు పాముకాటుకు గురై మృతిచెందాయా లేదా చిరుత దాడి చేసి చంపిందా, ఏదైనా విషప్రయోగం జరిగిందా అనేది తేలాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖ అధికారులు గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజలతో ముఖాముఖి

ప్రజాశక్తి-గాండ్లపెంట



ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా శుక్రవారం మండలంలోని సోమయాజుల పల్లి పంచా యతీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచి కాకర్ల రవీందర్‌రెడ్డి, ఎంపిటిసి జయరామకృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, సిఐటియు నాయకులు సాంబశివ, బాబ్‌జాన్, కెకె.రాజారెడ్డి, తదితరులు మాట్లాడుతూ గాండ్లపెంటలో జూనియర్ కాలేజీ, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, బిసి హాస్టల్‌కు దారి సౌకర్యం కల్పించాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. గండి చెరువు పిల్లకాలువల ద్వారా రైతుల పొలాలకు నీరందించాలన్నారు. గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు, యోగివేమన సమాధి వద్ద పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. పారిశుధ్య కార్మికుల వేతనాల పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబురావు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, జేఈలు రెడ్డివరప్రసాద్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఇఒ కృష్ణానాయక్, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఎస్.శివప్ప నాయుడు, అనసూయమ్మ, అన్ని శాఖ అధికారులు, నాయకులు కేశవరెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

దీక్ష జూనియర్, ఎస్వీ డిగ్రీ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-కదిరి టౌన్



ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న ప్రముఖులు

పట్టణంలోని కొలేపల్లి రైల్వే గేట్ వద్ద ఉన్న దీక్ష జూనియర్, ఎస్వీ డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు కార్యాచరణ రూపొందిం చుకుని కష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్ వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ విజయభాస్కర్, డైరెక్టర్ ఆర్.శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ శివశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగిచెర్లలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



చిగిచెర్లలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025లో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు మండలంలోని చిగిచెర్ల గ్రామ పంచాయతీలో పర్యటించారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రం, పిహెచ్‌సి, గ్రామసచివాలయం, చెత్త సంపద కేంద్రం, జనావాసాలు, మరుగుదొడ్లు, నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, మురుగు నీటి వనరులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు డ్రెయినేజీ, తదితర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. వారి వెంట అధికారులు కె.రామాంజనేయులు, ఎస్‌బిఎం కోఆర్డినేటర్స్ అనంత, డి.సాయినాథ్‌బాబు, ఎంపిడి సాయిమనోహర్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటేశ్వర్లు సర్పంచి బాబయ్య, పంచాయతీ సెక్రటరీ రెడ్డెమ్మ, నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వెలుగు సిబ్బందిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికై ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలను ఇతర కులాల వారికి మంజూరు చేసి దోపిడీకి పాల్పడిన వెలుగు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి డిఆర్‌డిఎ పిడి నరసయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రామగిరి మండలంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం కేటాయించిన వడ్డీ లేని రుణాల మంజూరులో వెలుగు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి ఇతరుల పేరుతో పంపిణీ చేసినట్లుగా రికార్డులు సృష్టించారని ఆరోపించారు. పాత యానిమేటర్ల పేరు మీద విఒఎల గౌరవ వేతనం కాజేశారన్నారు. అప్పటి టిడిపి ప్రభుత్వంలో పసుపు కుంకుమ పథకంలో కూడా అక్రమాలు జరిగాయన్నారు. వీటిపై సమగ్ర విచారణ, లేనిచో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగులప్ప, ప్రతినిధులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌పై గ్రామసభ

మడకశిర : 2 వేల మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌కు భూ సేకరణ అంశంపై శుక్రవారం మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచి గంగమ్మ, టిడిపి మండల కన్వీనర్ నాగ రాజు మాట్లాడుతూ ఏటా ఎకరాకు రూ. 30వేల చొప్పున ఇస్తారని, ప్రతి రెండేళ్లకు 5శాతం పెంచు తారని తెలిపారు. అలాగే గ్రామంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తద్వారా గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో కొందరు రైతులు గ్రామసభలోనే సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇచ్చారు. గ్రామసభలో రిటైర్డ్ ఆర్‌డిఒ, మండల రెవెన్యూ ఆఫీసర్, వీఆర్వోలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలేపల్లితండాలో 'మోసం గ్యారెంటీ'

నల్లచెరువు : మండలంలోని బాలేపల్లి తండాలో శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం రవి, సర్పంచి సోనాలమ్మ, ఎంపిటిసి రమణారెడ్డి స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి సిఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నాడంటూ వివరించారు. వారి వెంట నాయకులు సోమిరెడ్డి, రఫీ, హైటెక్ రమణనాయక్, నరసింహారెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎంపిటిసి రమణారెడ్డి, ఆదిమూర్తి, గోవిందరెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, సలీం, లక్ష్మీపతి, కృష్ణానాయక్, కృష్ణమూర్తి, ఖాదర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో ముద్ద చర్మవ్యాధితో జాగ్రత్త

పరిగి : మండలంలో పశువులు ముద్దకుంట వ్యాధికి గురవుతున్నాయని పాడి రైతులు జాగ్రత్త వహించాలని పశుసంవర్ధక శాఖ ఎడి సోమనాథ్ తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణకు ఉచితంగా టీకా వేశారు. ఆ శాఖ డివిజినల్ అధికారి పెంచలయ్య, ఎడి సోమనాథ్ మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు ఈ టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ టీకా వల్ల సీజన్ వ్యాధులతో పాటు ముద్ద చర్మ వ్యాధిని నియంత్రించవచ్చున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ గోవింద్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, సోమప్ప, నాగరాజు, శాసనకోట వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో క్యాన్సర్ పరీక్షలు

తాడిమర్రి : స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం వైద్యాధికారులు డాక్టర్ హరిత, డాక్టర్ గోవర్ధన్‌నా యుడు ఆధ్వర్యంలో సర్వైకల్ కాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా 30 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు సర్వైకల్ కాన్సర్ సోకే ప్రమాదం ఉందని, దీంతో ముందస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలు నిర్వహించామన్నారు. ఆర్‌డిఇ హాస్పిటల్ గైనకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ జ్యోతిసుచిత్ర, వైద్యాధికారి హిమశ్రీ నళిని 70 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ లలితకుమారి, పిహెచ్ఎన్ దేవి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలకు రూ.40 వేల అపరాధ రుసుము వేశారు. అందులో 3 ఆటోలు, ఒక కారు, ఒక గూడ్స్ వెహికల్‌కు అపరాధ రుసుము వేసినట్లు ఆయన తెలిపారు.

సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

గాండ్లపెంట : స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సమక్షంలో సింగిల్‌విండో నూతన అధ్యక్షుడిగా పాలెం రామాంజల్‌రెడ్డి, డైరెక్టర్లుగా జె.మునాఫ్, ఎం.వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, గంగ రాజు, నరసింహులు, పవన్‌కుమార్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ సచివాలయ సిబ్బందికి సన్మానం

లేపాక్షి : బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని శుక్రవారం సర్పంచి ఆదినారాయణ ఆధ్వర్యంలో సనామనించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపిడిఒ నరసింహమూర్తి, కుళ్లాయప్ప సచివాలయ సిబ్బందిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఆరేళ్లుగా పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్‌బాబు, విజయ్, విజయ్‌కృష్ణ, శ్రీనివాసులు, రఘు, తిరుమలేష్, నరసింహప్ప, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీకు ఎస్పీ సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



ఎస్పీ వి.రత్నకు పూలబొకే ఇస్తున్న ఎస్ఐలు

జిల్లాలో శిక్షణ కాలం పూర్తి చేసుకుని తిరిగి వెళ్తున్న శిక్షణ డీఎస్పీ ఉదయ పావనిని శుక్రవారం ఎస్పీ వి.రత్న జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శాలువాతో సత్కరించి జ్ఞాపిక అంద జేసి సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉదయపావని ధర్మవరం, కదిరి, మడకశిర, నల్లమాడ, అమడగూరు ప్రాంతాల్లో పని చేసి కేసుల విచారణ, బందోబస్తు, రికార్డుల నిర్వహణ, పోలీసుల నిర్వహించా ల్సిన విధులపై శిక్షణ పొందారన్నారు. బందోబస్తు, కష్టతరమైన కేసుల్లో కూడా బాగా పనిచేశారని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఉదయపావని మాట్లాడుతూ ఎస్పీ సహకారం వల్లే తాను అన్ని విషయాలపై పట్టు సాధించడంతో పాటు శిక్షణ కాలాన్ని పూర్తి చేశానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, మహేష్, డిసిఆర్‌బి, సోషల్ మీడియా సిఐలు శ్రీనివాసులు, మోహన్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, వీరన్న, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, పోలీస్ అధికారుల రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఎఎస్ఐలు షౌకత్‌వలి, శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్ఐలు

జిల్లాలో ఇటీవల ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన 10 మంది పోలీసు అధికారులు శుక్రవారం ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. 1990 బ్యాచ్‌కి చెందిన వీరు జిల్లాలో ఎఎస్ఐలుగా పని చేసేవారు. ఎస్పీ ప్రత్యేక చొరవతో వీరందరికీ ఒకేసారి ఉద్యోగోన్నతి లభించింది.

సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు : ఎంపీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మండలంలోని రాంపురం వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు జాతీయ రహదారులు, కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నిధులు మంజూరు చేసినట్లు ఎంపి బికె.పార్థసారథి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి, కొత్తచెరువు నుంచి పెడబల్లి, నిడిమామిడి, శెట్టిపల్లి, కొండపల్లి, రాంపురం గ్రామాల నుంచి కియా, దాని అనుబంధ సంస్థలకు రోజూ వందల సంఖ్యలో బస్సులు, కంటైనర్లు, ద్విచక్ర వాహనాలు, ప్రజలు కొత్తచెరువు రోడ్డు నుంచి పెనుకొండ ఎన్‌హెచ్-44 బైపాస్‌కు సర్వీస్ రోడ్డులో వెళ్తుతుంటారన్నారు. ఈ రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైందని సమీప గ్రామాల ప్రజలు, కియా ఉద్యోగులు తన దృష్టికి తీసుకురావడంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వివరించగా నిధులు మంజూరు చేశారన్నారు.

బదిలీ వ్యవసాయ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

బదిలీపై వెళ్లిన ధర్మవరం డివిజన్ వ్యవసాయ అధికారి గుజ్జల కృష్ణయ్య, ధర్మవరం డివిజన్ నుంచి బదిలీపై వెళ్లిన వ్యవసాయ అధికారులు కృష్ణకుమారి, రమాదేవి, ఉదయ్‌కుమార్‌లను శుక్రవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంల సన్మానించారు. ఎడిఎ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ గుజ్జల కృష్ణయ్య వ్యవసాయ రంగం, రైతులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ వ్యవసాయ అధికారులు, ఎఇఒలు, విహెచ్ఎలు, విఎస్ఎలు, విఎఎలు, ఎంపిఇఒలు, కార్యాలయ సిబ్బంది, ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

'టిడిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి'

ప్రజాశక్తి-గుడిబండ

టిడిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, మా నాయకుడు ఈరలక్కపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని వైసిపి నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ డి.ఎల్.ఎంజేరేగౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు ఈరలక్కప్పపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిం చారు. మీ నాయకుడు చంద్రబాబు 2024 ఎన్నికల్లో మడకశిర టిడిపి అభ్యర్థిని మార్చిన విషయంపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు రూ. 1500, 50 ఏళ్లు నిండిన వారికి పింఛను, మహిళలకు ఫ్రీ బసు, రైతు భరోసా, తదితర హామీల అమలుపై నిలదీశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, బైరప్ప, రామచంద్రప్ప, శివన్న, పాండు, భోజరాజు, నటరాజ్ పాల్గొన్నారు.

సమావేశానికి వేళకు రాని అధికారులు.. ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల అధికారులు సర్వసభ్య సమావేశానికి నిర్దేశిత సమయంలో హాజరుకావాలని ఎంపిపి రమణారెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమై గంట అయినా అధికారులు వస్తూనే ఉన్నారని, 3 నెలలకు ఓ సారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి నిర్దేశిత సమయంలో హాజరవ్వడానికి అంత నిర్లక్ష్యం ఏమిటని ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తాను ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని వైస్ ఎంపిపి నారాయణస్వామి సభ దృష్టికి తీసుకెవెళ్లారు. ఐహెచ్ఎల్ మరుగుదొడ్లు కోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. అల్లుగుండు పంచాయతీలో పోల్‌మెన్లు మంజూరు చేయాలని కార్యదర్శి విజయ్‌కుమార్ కోరారు. అలాగు పలు పంచాయతీల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలను చదివి వినిపించారు. ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ జమానుల్లా ఖాన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కవిత, విద్యుత్ శాఖ అధికారి జనార్దన్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-రొద్దం



హెచ్ఎం హరీష్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు

బదిలీపై వెళ్తున్న మండలంలోని దొడగట్ట గ్రామ ఎంపిపి పాఠశాల హెచ్ఎం హరీష్‌రావును శుక్రవారం హెచ్ఎం ఆధ్వర్యం లో ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు ఘనం గా సన్మానించారు. ముందుగా సర్పంచి బాలాజీ, హెచ్ఎం తేజ హరీష్‌రావు దంపతుల ను పూల మాలలు, శాలువాలతో సన్మానించా రు. సుమారు రూ. 20 వేల విలువ చేసే వెండి ప్రమిదలను బహూకరించారు. వారు మాట్లా డుతూ హరీష్‌రావు పాఠశాల, విద్యార్థులను తన కుటుంబంలా భావించి 9 ఏళ్ల పాటు సేవలు అందించారని కొనియాడారు. ఆయన మడకశిర మండలంలోని కల్లుమర్రి పాఠశాలకు బదిలీ అయ్యారన్నారు. వారి అనుబంధాన్ని గుర్తు చేసుకుం టూ గ్రామస్తులు, విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయచంద్ర, హైస్కూల్ హెచ్ఎం గిరిధర్, ఉపాధ్యాయులు, బిసి కాలనీ ఉపాధ్యాయులు, వైటి.రెడ్డిపల్లి ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ నరసింహమూర్తి, వైస్ ఛైర్మన్ సుకన్య, దుర్గప్ప, వెంకటేష్, హనుమంతు, మూర్తి, పురుషోత్తం, ప్రజలు పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో 'మీ సమస్య-మా బాధ్యత'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపించేంత వరకూ విశ్రమించమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హామీ తెలిపారు. పట్టణంలోని శివానగర్, కేశవ నగర్‌లలో శుక్రవారం శ్రీరామ్ 'మీ సమస్య-మా బాధ్యత' సభ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో పరిష్కారమయ్యేవి స్థానికంగానే చేస్తామన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన వాటిపై ఓ ప్రణాళిక ప్రకారం పని చేస్తామని వివరించారు. హౌస్ మ్యాపింగ్‌లో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల చాలా మంది పింఛను సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. హౌస్ మ్యాపింగ్ అంశంపై రాష్ట్రస్థాయి అధికారులతో చర్చిస్తామన్నారు. ఇంటి పట్టాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-రొద్దం

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకుడు బబ్లుగంగోలి పేర్కొన్నారు. మండలంలోని ఆ సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం సుశీలమ్మ అధ్యక్షతన సీఈఓ లావణ్య ఆధ్వర్యంలో అనంతశక్తి సొసైటీ 26వ వార్షిక మహాసభ నిర్వహించారు. ముందుగా సొసైటీ సీఈఓ 2024-25 కార్యక్రమాలు, నివేదిక, ఆర్థిక, పాలక వర్గ మార్పులు, చేర్పులను సభ్యులకు నివేదించారు. ముఖ్యఅతిథి బబ్లు గంగోలి మాట్లాడు తూ మహిళలు సమాజంలో ఆర్థిక, రాజకీయ, నాయకత్వ రంగాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య మాట్లాడుతూ పరిపాలన నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ వల్ల మహిళ లు అభివృద్ధి చెందుతారన్నారు. మండలంలోని సుమారు 10వేల మంది మహిళలు కలిసికట్టుగా రూ. 18 కోట్ల లావాదేవీలతో సమర్థవంతంగా సొసైటీని నిర్వహిస్తున్నారని అభినందించారు. చివరగా చిన్నారుల నృత్యాలు, చెక్కల భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, టింబక్టివ్ కలెక్టివ్ మేనేజర్లు, మహాశక్తి సీఈఓ రామీజా, రవళి, అనంతశక్తి సిబ్బంది, సిబ్బంది, 700మంది మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల తనిఖీ

ప్రజాశక్తి-కొత్తచెరువు



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ సువర్ణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఆర్‌డిఒ సువర్ణ సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని ఎర్రబల్లి, బండ్లపల్లి పాఠశాలలను సందర్శించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజనం, రాగిజావ, చిక్కీలు, విద్యార్థి మిత్ర కిట్లు సక్రమంగా అందించారా, మెనూ ప్రకారము భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి, ఉపాధ్యాయు లకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహశీల్దార్ బాలాంజ నేయులు, ఎంఇఒ జయచంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తహశీల్దార్ సురేష్‌బాబు సందర్శించారు. హాస్టల్‌లో వసతి, సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని వార్డెన్ లత తెలిపారు. ఆయన వెంట విఆర్ఒ రవిశంకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తాడిమర్రి : మండలంలోని బిసి సంక్షేమ వసతి గృహం, కెజిబివి వసతి గృహాలను తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి సందర్శించారు. భోజన సదుపాయాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

నంబులపూలకుంట : మండలంలోని గూటిబైలు, ఎన్‌పి కుంట బిసి బాలుర వసతి గృహాలను తహశీల్దార్ దేవేంద్రనాయక్ సందర్శించి రికార్డులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు అందించడంలో వార్డెన్ విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, విద్యార్థులు మలవిసర్జనకు ఆరుబయటకు వెళుతున్నారని, వార్డెన్ స్థానికంగా ఉండటం లేదని విచారణలో వెల్లడైందని తెలిపారు.